
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 14, అక్టోబర్, 2024



సోమశిలలో 52.16 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 52.16 టీఎంసీలు ఉన్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి 8,200 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 50, ఉత్తరకాలువకు 200, దక్షిణకాలువకు 8,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.78,390
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.7,120
3 శాతం జీఎస్టీతో	రూ.7,334
నవర (8 గ్రా)	రూ.58,672

గరిష్టం/కనిష్టం
35.0 /26.9

వాతావరణం

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆదివారం గాలిలో తేమ 70 శాతం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు భారీ వర్షసూచన

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (అర్బన్): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా, వాయుగుండంగా తీవ్ర రూపం దాల్చుతుందని, తుఫాన్‌గా మారే నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. ఆదివారం కలెక్టర్ వెబెక్స్ ద్వారా జిల్లాలోని అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే ఎదురయ్యే ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే 3-4 రోజులు జిల్లా యంత్రాంగమంతా అందుబాటులో ఉండాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. వేటకు వెళ్లిన వారిని కూడా వెంటనే వెనక్కి రప్పించాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పెన్నా తీరం పరిశీలిస్తూ బలహీనంగా ఉన్న చోట్ల గండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిత్యావసరాలు, పాలు, కూరగాయలు, వాహనాలు, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని స్థాయిల్లోని సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నట్టు తెలిపారు. తీర ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే తుఫాన్ షెల్టర్లకు తరలించాలన్నారు. అన్ని డివిజన్లలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీవర్షాల ప్రకటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ముందస్తుగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందన్నారు. అత్యవసరమైతే కంట్రోల్ రూం ఫోన్ నంబర్లు 0861-2331261, 7995576699-1077లకు ప్రజలు ఫోన్ చేయాలని సూచించారు. ఈ వెబెక్స్‌లో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేసినట్టు కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో వివరించారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించాలని, కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం

- అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): జిల్లాకు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థకు సంబంధించి ముందస్తు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లోని ఆయన చాంబర్‌లో ఆదివారం జిల్లాలోని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి వరకు సిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. విద్యుత్ కాంట్రాక్టరు వద్ద పనిచేసే సిబ్బందిని, షిఫ్ట్ ఆపరేటర్లను, అందుబాటులో ఉంచుకోవాలని," సెల్‌ఫోన్‌లో చార్జింగ్ ఫుల్‌గా చేసుకుని ఉంచాలని, అవసరమైనప్పుడు వాకీటాకీలను కూడా వినియోగించుకోవాలన్నారు. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయినా, లైన్లు తెగిపోయినా వెంటనే వాటిని పునరుద్ధరించేలా ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. 24 గంటలు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండేలా అన్ని డివిజన్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కంట్రోల్ రూమ్‌ల్లో మూడు షిఫ్టుల పద్ధతిలో సిబ్బందిని ఇప్పటికే నియమించామని, ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నేటి నుంచి పాఠశాలలు, కళాశాలలు పునః ప్రారంభం


నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సోమవారం నుంచి పునః ప్రారంభించనున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 2 నుంచి 13వ తేదీ వరకు సెలవులను ప్రకటించారు.

టెట్‌కు 90 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్): టెట్‌కు జిల్లా వ్యాప్తంగా మొత్తం 90 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 596 మందికి 522 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 110 మందికి 94 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు.

వేలానికి టిడ్కో ఇళ్లు

- బ్యాంకు రుణాలు చెల్లించడం లేదంటూ వేలం ప్రకటన ఇచ్చిన యూనియన్ బ్యాంకు
- ఇప్పటికే ఆ గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు
- ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లపై ఉన్న రుణాలు రద్దు చేసి ఉచితంగా ఇస్తామని చెప్పిన చంద్రబాబు
- జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు కందుకూరులో జీ+3 విధానంలో నిర్మాణం



పేదల సొంతింటి కలను సాకారం చేస్తానంటూ సీఎం చంద్రబాబు వారిని అప్పుల ఊబిలోకి నెట్టేశారు. ఆయన మానస పుత్రికలుగా చెప్పుకునే టిడ్కో ఇళ్లు పేదలకు పెనుభారంగా మారాయి. ప్రతి నెల బ్యాంకు రుణాల పేరుతో పేదల నడ్డి విరుస్తున్నాయి. రుణ కంతులు చెల్లించని ఇళ్లను ప్రస్తుతం బ్యాంకు అధికారులు జప్తు చేస్తున్నారు. దీంతో పేదలు ఉన్న గూడును కోల్పోయి రోడ్డున పడాల్సిన దుస్థితి వచ్చింది. జిల్లాలో గతంలో అప్పటి సీఎం చంద్రబాబు సార్వత్రిక ఎన్నికలకు ఏడాదిన్నర ముందు మూడు కేటగిరీల్లో జీ+3 విధానంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసిన నిధులతో పాటు అదనంగా అయ్యే మొత్తాన్ని బ్యాంకుల ద్వారా ఇరవై ఏళ్ల పాటు రుణం చెల్లించే విధంగా టిడ్కో ఇళ్లను అప్పట్లో కేటాయించారు.

అప్పుల ఊబిలో లబ్ధిదారులు

కేటగిరీ	టిడ్కో ఇళ్లు	కేంద్ర, రాష్ట్రాల సాయం	లబ్ధిదారుడి వాటా	బ్యాంకు రుణం
300 చ.అ. గృహాలు	26,176	రూ.3 లక్షలు	రూ.25 వేలు	రూ.2.50 లక్షలు
365 చ.అ. గృహాలు	2,368	రూ.3 లక్షలు	రూ.50 వేలు	రూ.3.46 లక్షలు
430 చ.అ. గృహాలు	3,344	రూ.3 లక్షలు	రూ. లక్ష	రూ.3.95 లక్షలు



కందుకూరు పట్టణంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కందుకూరు: జిల్లాలో టిడ్కో ఇళ్లు వేలానికి వచ్చాయి. ఆ ఇళ్లల్లో ఉంటున్న పేదలు రోడ్డున పడుతున్నారు. పేదలకు సొంతింటి కల తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. కానీ చంద్రబాబు మాయ మాటలతో నమ్మించి పేదలను అప్పుల ఊబిలో కూర్చేశారు. తమ జీవిత కాలం పాటు బ్యాంకులకు అప్పులు చెల్లించుకునే దుస్థితిని కల్పించారు. షీర్‌వాల్ టెక్నాలజీ పేరుతో చదరపు అడుగుకు రూ.2,000 నిర్ణయించి పేదల ఇళ్లల్లో మున్సిపల్‌శాఖ మంత్రి రూ.వేల కోట్లు దోచుకున్నారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకాల ద్వారా టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షలు నిధులు మంజూరు చేస్తే.. అదనపు మొత్తాన్ని బ్యాంకు రుణంగా అందజేసింది. ఆ గృహాలు పొందిన లబ్ధిదారులు ప్రస్తుతం బ్యాంకు రుణం చెల్లించకపోవడంతో బ్యాంకర్లు నోటీసులు అంటిస్తున్నారు.

మూడు కేటగిరీల్లో గృహసముదాయాలు

జిల్లాలో నెల్లూరు నగర పరిధిలో వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి, కావలి, ఆత్మకూరు, కందుకూరు మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్లను నిర్మించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి కేటగిరీ ఇంటికి రూ.3 లక్షలు కేటాయించగా, లబ్ధిదారుల వాటాలు పోను మిగిలిన మొత్తాన్ని 20 ఏళ్ల పాటు నెల నెలా వాయిదాల రూపంలో లబ్ధిదారులే చెల్లించాల్సి ఉంటుంది. జీ+3 మోడల్ ఇళ్లను మూడు కేటగిరీల కింద నిర్మించారు. వీటిలో 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు, 360 చదరపు అడుగుల విస్తీర్ణంలో సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించారు. వీటిలో పాటు 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడో కేటగిరీ ఇళ్లు నిర్మించారు. లబ్ధిదారుల ఆర్థిక స్తోమతకు అనుగుణంగా ఏ కేటగిరీ ఇళ్లను ఎంపిక చేసుకోవాలనే లబ్ధిదారులకు అప్పగించారు. ఈ లెక్కన 300 చ.అ. ఇంటికి సంబంధించి రూ.2.50 లక్షలు, 365 చ.అ. ఇంటికి రూ.3.46 లక్షలు, 430 చ.అ. రూ.3.95 లక్షలు లబ్ధిదారులు చెల్లించే విధంగా అప్పట్లో చంద్రబాబు బ్యాంకర్లతో అగ్రిమెంట్లు చేయించారు. వాస్తవానికి అప్పట్లో నగర నడిబొడ్డు ప్రాంతాల్లో కమర్షియల్ భూముల్లో నిర్మించిన అపార్ట్మెంట్లలో చదరపు అడుగు రూ.2 వేల లోపు మాత్రమే ఉండేది. అయితే నగరంతో పాటు పట్టణ శివార్లలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన భూముల్లో నిర్మించిన టిడ్కో ఇళ్లకు సంబంధించి చ.అ. రూ.1,910 లెక్కన అప్పటి పాలకులు పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తామంటూ అప్పుల ఊబిలో కూర్చేశారు. అప్పట్లోను ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను ఎంపిక చేసి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు అకౌంట్లు కూడా ఓపెన్ చేయించారు. అయితే ఇళ్లను పూర్తి చేయడంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

గుదిబండగా బ్యాంకు రుణాలు

టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ప్రస్తుతం బ్యాంకు రుణాలు గుదిబండగా మారాయి. పేరుకు సొంత ఇల్లు అయినా ప్రతి నెల అద్దె కట్టినట్లు బ్యాంకుకు ఈఎంఐలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబుల్ బెడ్‌రూమ్ యూనిట్ ఇంటి అసలు ఖరీదు రూ.7 లక్షలకు పైగా ఉంది. ఇందులో ప్రభుత్వాల వాటా పోను రూ. 3.65 లక్షలు లబ్ధిదారుడు కట్టాల్సి ఉంది. దీనిలో మొదట్లోనే డిపాజిట్ కింద రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఈ లక్ష చెల్లించడం భారంగా ఉండడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డిపాజిట్‌ను రూ.50 వేలకు తగ్గించింది. ఇది పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లింకేజీ కింద రుణంగా ఇచ్చారు. సింగల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఖరీదు రూ.6 లక్షలు ఉంటే రూ.3.15 లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని ఇళ్లు పొందిన లబ్ధిదారుడు ప్రతి నెలా బ్యాంకు ఈఎంఐల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కూలినాలి, చిరు వ్యాపారాలు చేసుకునే పేదలు ప్రస్తుతం ప్రతి నెలా బ్యాంకులకు రుణాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. దీంతో రుణాలు చెల్లించని ఇళ్లను బ్యాంకులు స్వాధీనం చేసుకుని వేలానికి పెడుతున్నాయి.

ఉచితంగా ఇస్తామని చెప్పి మోసం

ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు టిడ్కో ఇళ్లపై ఉన్న బ్యాంకు రుణాలను రద్దు చేసి ఉచితంగా లబ్ధిదారులకు ఇస్తామని ప్రచారం చేశారు. చంద్రబాబు ప్రకటన చూసిన అనేక మంది లబ్ధిదారులు బ్యాంకు రుణాలు తీసుకునేందుకు ఓకే చెప్పారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బ్యాంకులు మాత్రం రుణాలు చెల్లించాల్సిందేనంటూ లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నాయి. దీంతో దిక్కు తోచని స్థితిలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు.

పేదల పాలిట శాపంగా..

గత టీడీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రస్తుతం లబ్ధిదారులకు శాపంగా మారింది. 2014 నుంచి అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం మూడున్నరేళ్ల పేదల ఇళ్ల విషయాన్ని గాలికి వదిలేసింది. ఎన్నికలకు ఏడాదిన్నర ముందు టిడ్కో ఇళ్ల పేరుతో పేదల్లో ఆశలు రేకెత్తించింది. 2017 చివరిలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2019లో ఎన్నికల నాటికి కూడా ఆయా ఇళ్లను పూర్తి చేయలేకపోయింది. లబ్ధిదారుల ఎంపిక, బ్యాంకర్లతో రుణ ఒప్పందాలు మాత్రం చేసేసి, నిధులు మొత్తం కాజేసింది. 300, 360, 430 కేటగిరీల్లో అందరూ 20 ఏళ్ల పాటు బ్యాంకులకు రుణాలు చెల్లించే విధంగా ఒప్పందాలు చేయడంతో అది ఇప్పుడు ఆ పేదల పాలిట శాపంగా మారింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
300 చ.అ. ఇళ్లు ఉచితం

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 300 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు రూపాయికే అందజేసింది. మిగిలిన రెండు కేటగిరీల్లోనూ లబ్ధిదారులు చెల్లించాల్సిన వాటాను తగ్గించింది. ఆయా ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపేసింది. వీటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు కేటాయించి పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసింది.

లబ్ధిదారులకు నోటీసులు

జిల్లాలో సింగిల్, డబుల్ బెడ్రూమ్ కేటగిరీ ఇళ్లను పొందిన లబ్ధిదారులకు ప్రతి నెల రుణ కంతులు చెల్లించడం భారంగా మారడంతో చెల్లించలేకపోవడంతో బ్యాంకర్లు జప్తు నోటీసులు జారీ చేస్తోంది. మూడు నెలల క్రితమే నెల్లూరు నగర పరిధిలోని లబ్ధిదారులకు నోటీసులు అందజేసింది. ఇటీవల కందుకూరులోని ఐదుగురు లబ్ధిదారులకు యూనియన్ బ్యాంకు జప్తు నోటీసులు ఇవ్వడంతో పాటు పత్రికా ప్రకటన చేయడంతో లబోదిబోమంటున్నారు. కందుకూరు పట్టణంలోని ఉప్పు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సమీపంలో టీడీపీ ప్రభుత్వం 1408 టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తి చేసింది. దాదాపు రూ.23 కోట్లు ఖర్చు చేసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీలు, సివరింగ్ ప్లాంట్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించి గతేడాది సెప్టెంబర్‌లో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించింది. అప్పటి నుంచి అనేక మంది లబ్ధిదారులు ప్రస్తుతం ఆ ఇళ్లలో నివాసం ఉంటున్నారు.



టిడ్కో ఇళ్లను వేలం వేస్తున్నట్లు బ్యాంకు ఇచ్చిన ప్రకటన

లిక్కర్ లక్ ఎవరిదో?

- జిల్లాలో 182 దుకాణాలకు 3,890 దరఖాస్తు
- దరఖాస్తులపై రోజుకోలెక్కపై అనుమానాలు
- టీడీపీ నేతలే పేర్లు మార్చి దరఖాస్తులు వేసినట్లు సమాచారం
- నేడు కస్తూర్బా కళాక్షేత్రంలో లాటరీ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, డీసీ

నెల్లూరు (క్రైమ్): జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు డ్రా ప్రక్రియ సోమవారం నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరగనుంది. ఇందుకు సంబంధించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. లక్కీ డ్రాలో దుకాణాలు ఎవరిని వరిస్తాయోననే ఉత్కంఠత నెలకొంది. అయితే దరఖాస్తులపై రోజుకొక లెక్క వెల్లడించడంతో కొన్ని అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఆది నుంచి మద్యం దుకాణాలను కేవలం టీడీపీ నేతలే సిండికేట్‌గా దక్కించుకోవాలనే వ్యూహంతో వ్యవహరించారు. పైసా పెట్టుబడి పెట్టకుండానే వాటాలు ఇవ్వాలనే బెదిరింపులు, బేరాలతో గతంలో మద్యం వ్యాపారం చేసిన వారితో పాటు ఔత్సాహికులు దరఖాస్తులు చేసేందుకు వెనుకాడారు. దీంతో దుకాణానికి కనీసం రెండు.. మూడు కూడా పడే అవకాశం లేకపోవడంతో టీడీపీ సిండికేట్‌గా మారిందనే ప్రచారం ప్రజల్లోకి వెళ్తుందని ప్రభుత్వ పెద్దల సూచలనతో ఎక్సైజ్ అధికారులు ఊరూరా తిరిగి దరఖాస్తులు వేయించేందుకు నేల విడిచి సాము చేసినా ఫలితం లేకపోయింది. టీడీపీ సిండికేట్‌లోనే వ్యక్తులే పేర్లు మార్చి దరఖాస్తులు చేసినట్లు తెలుస్తోంది. మద్యం దుకాణాల దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో తొలుత 3,872 దరఖాస్తులు వచ్చినట్లు ప్రకటించారు. ఆ తర్వాత శనివారం ఆదివారాల్లో దరఖాస్తులను పరిశీలించాక 3,875 వచ్చాయని, సాయంత్రానికి 3,890 వచ్చాయని ప్రకటించారు. ఈ లెక్కలపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లక్కీ డిప్‌లో కచ్చితంగా తమనే వరించాలనే ఉద్దేశంతో కొన్ని దుకాణాలకు గడువు ముగిశాక కూడా దరఖాస్తులు చేసినట్లు కొందరు అనుమానిస్తున్నారు. సగటున ఒక్కో దుకాణానికి 21 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులకు ఎంట్రీపాస్‌లు అందజేశారు.

ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన

కస్తూర్బా కళాక్షేత్రంలో ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ ఆనంద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తదితరులతో కలిసి పరిశీలించారు. లక్కీ డ్రా ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అన్నీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తుగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఏసీ దయాసాగర్, డీపీఈఓ శ్రీనివాసులనాయుడు, ఏఈఎస్ రమేష్ తదితరులున్నారు.

ఉదయం ఏడు గంటలకే..

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 7 గంటలకే కస్తూర్బా కళాక్షేత్రానికి చేరుకోవాలి. ప్రవేశ పత్రం, గుర్తింపు కార్డుతో దరఖాస్తుదారుడిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. అతను రాలేని పక్షంలో ఆథీకృత బాధ్యుడిని అనుమతిస్తారు. ఎనిమిది గంటలకు లాటరీ డ్రా ప్రారంభమవుతుంది. తొలుత నెల్లూరు నగరం, చివరన ఓలేటివారిపాళెం దుకాణాలకు లాటరీ తీస్తారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వ్యాపారి లైసెన్సు వార్షిక రుసుంలో ఆరో వంతు చెల్లించిన అనంతరం ప్రొవిజనల్ లైసెన్సులను అధికారులు మంజూరు చేస్తారు. 16వ తేదీ నుంచి మద్యం దుకాణాలు అందుబాటులోకి రానున్నాయి.

ఆందోళనలో దరఖాస్తుదారులు

తమను కాదని దరఖాస్తులు వేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కూటమి నేతలు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయా నేతల మాటలు కాదని కొందరు దరఖాస్తులు దాఖలు చేశారు. లాటరీలో వారికి దుకాణం వస్తే ఆ తర్వాత పరిస్థితి ఏంటన్న ప్రశ్న వారిలో నెలకొంది. ఏది ఏమైనప్పటికీ లాటరీలో దుకాణాలు దక్కించుకునే వారు వాటిని ప్రారంభించేంత వరకు అనేక ఒడిదుడుకులు ఎదుర్కోక తప్పని పరిస్థితి అనేక చోట్ల నెలకొననుంది.

అక్రమ కేసులకు భయపడేది లేదు



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- 2027లోనే జమిలి ఎన్నికలు రావడం ఖాయం
- కార్యకర్తలు సమాయత్తం కావాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : టీడీపీ నేతలు పెట్టే అక్రమ కేసులకు వణికేది, భయపడేది లేదని, న్యాయపరంగా ఎదుర్కొంటామని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నావూరు, బత్తులపల్లి గ్రామాల్లో శనివారం కాకాణి పర్యటించారు. ఇటీవల నావూరు మాజీ సర్పంచ్ బొడ్డు నరసింహులుపై అక్రమ కేసు బనాయించడం నేపథ్యంలో ఆయన్ను పరామర్శించారు. ఈ కుట్రలను కాకాణి ఖండించారు. చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రాగా వారికి కాకాణి ధైర్యం చెప్పారు. నావూరు, బత్తులపల్లిలో ఇటీవల మృతి చెందిన తలపనేని పెంచలనాయుడు, పొదలకూరు రమణమ్మ, సూరా శేషారెడ్డి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027లో జమిలి ఎన్నికలు రావడం ఖాయమని, కార్యకర్తలు సమాయత్తం కావాల్సిందిగా సూచించారు. బొడ్డు నరసింహులుపై పెట్టిన అక్రమం కేసుపై అన్ని ఆధారాలతో హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు. పొదలకూరు-సంగం రోడ్డు నుంచి భోగసముద్రంకు వెళ్లే రోడ్డు పనులు ఎన్నికల తర్వాత నిలిచిపోయినట్టు పేర్కొన్నారు. సోమిరెడ్డికి లేఅవుట్ల యజమానులతో బేరాలు కుదిరాయి కాని రోడ్లు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో బేరం కుదరకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయినట్టు ఆరోపించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమంగా తరలిస్తూ సోమిరెడ్డి రూ.కోట్లు గడిస్తున్నట్టు పేర్కొన్నారు. విరువూరు ఓపెన్ ఇసుక రీచ్‌లో అక్రమార్జనకు సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నట్టు విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కాకాణి వెంట నాయకులు బచ్చల సురేష్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు పెంచలనాయుడు, రామిరెడ్డి, కోడూరు ఆనంద్‌రెడ్డి, నోటి బాలకొండారెడ్డి, టి.ప్రసాద్‌నాయుడు, నీలం మాల్యాద్రిరెడ్డి, మక్కిన వెంకటేశ్వర్లు, ఉడతా రమేష్, సీహెచ్ రమేష్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయినాథుడి ఆరాధన మహోత్సవాలు



సాయినాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

- షిరిడీ సంప్రదాయ రీతిలో మహాసమాధి ఘట్టం
- సాయినాథుడికి 306 జ్యోతులతో దివ్యనక్షత్ర హారతి



సాయినాథుడికి నక్షత్రహారతులు

నెల్లూరు (బృందావనం): జిల్లాలోనే ప్రత్యేకంగా షిరిడీ సంప్రదాయ రీతిలో నగరంలోని బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయిబాబా 106వ మహాసమాధి (ఆరాధన) మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించిన భక్తులు, శనివారం షిరిడీ సంప్రదాయ రీతిలో నాలుగు వేళల్లో కాకడ, మధ్యాహ్న, సంధ్య, శేజ్ హారతులు ఇచ్చారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అఖండ సాయి నామ సంకీర్తన తన్మయత్వంతో సాగింది. సాయిబాబా మహాసమాధి చెందిన సమయం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో 306 జ్యోతుల ప్రజ్వలన, మహా సమాధి ఘట్టం పారాయణం, సమాధి కీర్తనలు, సామూహిక ధ్యానం, సాయినాథుడికి నక్షత్ర హారతులు ఆద్యంతం నేత్రపర్వంగా, భక్తితత్పరతతో సాగాయి. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి శ్రీసాయిసచ్చరిత్ర పారాయణం, పల్లకి ఉత్సవం, ఊంజల్ సేవ, పవళింపు సేవలు వేడుకగా సాగాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి సాయినాథుడిని దర్శించుకొని తీర్థ, ప్రసాదాలు, అన్నప్రసాదం స్వీకరించారు. సాయినాథుడు విశేష పుష్పాలంకరణలో భక్తులను కటాక్షించారు. ఆయా కార్యక్రమాలకు ఉభయకర్తలుగా మోదెం మల్లికార్జునరావు, భారతి, కనిశెట్టి సురేష్‌బాబు, సరస్వతి, సన్నపురెడ్డి సుకన్య, సాయి భక్తబృందం వ్యవహరించింది. సాయిదర్బార్ గౌరవ సలహాదారులు పాబోలు రామసుబ్బయ్య, సాయిదర్బార్ సత్సంగ్ సేవాదళ్ సభ్యులు, మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి పర్యవేక్షించారు. ఆరాధన మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి శ్రీసాయిసచ్చరిత్ర పూర్తి గ్రంథం అఖండ పారాయణం చేపట్టారు.

ఉలవపాళ్లలో స్వల్ప భూప్రకంపనలు

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి మండలం ఉలవపాళ్లలో శనివారం మధ్యాహ్నం భూమి స్వల్పంగా కంపించింది. మధ్యాహ్నం 1.24 గంటల సమయంలో భూమి పెద్ద శబ్దంతో ప్రకంపించడంతో గ్రామస్తులు ఉలిక్కి పడ్డారు. ఒకటి, రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ఇళ్లల్లోని వస్తువులు శబ్దాలు వచ్చాయి. ఇప్పటి వరకు ఈ తరహాలో భూమి కంపించిన ఘటనలు గ్రామంలో చోటు చేసుకోలేదని స్థానికులు తెలిపారు. గతంలో కప్పరాళ్లతిప్పలో ఇదే తరహాలో కొన్ని సెకన్ల పాటు భూమి కంపించిన ఘటనలు ఉన్నాయి. తిప్పకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఉలవపాళ్లలో తాజాగా భూమి కంపించింది. భూకంపాలకు ఆస్కారం లేని రాతి నేల ప్రాంతంలోనూ భూమి కంపించడంపై స్థానికులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

బాధితులకు బంగారు చైన్ అందజేత

నెల్లూరు(క్రైమ్): స్కూటీని నేర్చుకునే క్రమంలో యువతి మెడలోని బంగారు గొలుసు తెగి కిందపడింది. దీన్ని గమనించి బాధితులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అందజేశారు. వివరాలు.. శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఓవెల్ స్కూల్ కరస్పాండెంట్ వేణు కుమార్తె అన్నమయ్య సర్కిల్ వద్ద స్కూటీని నేర్చుకునే క్రమంలో ఆమె మెడలోని బంగారు గొలుసు శనివారం సాయంత్రం కిందపడిపోయింది. ఈ విషయాన్ని ఆమె గమనించలేదు. మెడలో గొలుసు లేకపోవడాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు అన్నమయ్య సర్కిల్ వద్దకు చేరుకొని వెతకసాగారు. ఇదే సమయంలో శ్రీనగర్‌లో నివాసం ఉంటున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరహరి అన్నమయ్య సర్కిల్ వద్ద వాకింగ్ చేస్తుండగా, రోడ్డుపై బంగారు గొలుసు పడి ఉండటాన్ని గుర్తించి తీసుకున్నారు. గొలుసును ఎవరైనా పోగొట్టుకున్నారానని చుట్టుపక్కల ఆరాతీస్తుండగా, యువతి కుటుంబసభ్యులు తమదేనని చెప్పడంతో వారికి అప్పగించారు.

వీఎస్‌యూలో నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో ఐ సెట్, పీజీ సెట్, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, డిగ్రీ హానర్స్ కోర్సులు, మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభంకానుందని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ – 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు, రాయని వారు సీటు పొందేందుకు గానూ వీఎస్‌యూ అడ్మిషన్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. వీఎస్‌యూ పరిధిలో ఆర్‌సెట్ 2023 – 24 ద్వారా పీహెచ్‌డీ సీటు పొందిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 19లోపు సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 94415 99597, 99893 53455 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పొదలకూరు: బైక్‌లు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని సోమశిల రోడ్డు నరసింహకండ్రిక వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని కనుపర్తి ఎస్సీ కాలనీకి చెందిన పెంచలయ్య స్థానిక నిమ్మ మార్కెట్ యార్డులో పని ముగించుకొని బైక్‌పై గ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో బైక్ ఢీకొంది. ప్రమాదంలో పెంచలయ్య కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. మరో బైక్‌పై వస్తున్న వ్యక్తి వివరాలు తెలియరాలేదు. క్షతగాత్రుడ్ని 108లో ఆస్పత్రికి తరలించారు.

వాహనం ఢీకొని డ్రైవర్ దుర్మరణం



ఉలవపాడు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొల్లూరుపాడు బైపాస్ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లా అంబూరుకు చెందిన లారీ డ్రైవర్ గునాలమ్ (30) గుంటూరు నుంచి మిర్చి లోడ్‌తో చెన్నై బయల్దేరారు. ఉలవపాడు సమీపంలోకి వచ్చేసరికి వర్షం పడుతుండటంతో లారీ దిగి పట్టను కట్టసాగారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను 108లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని అక్కడే ఉంచారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి

కావలి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం చౌదరిపాళేనికి చెందిన కోడెల సాయికార్తీక్ (26)కు ఏడాది క్రితం వివాహమైంది. ప్రసవం కోసం పుట్టింటికెళ్లి మగ బిడ్డకు భార్య జన్మనిచ్చారు. మొదటి నెల్లోనే బిడ్డను తీసుకొని ఇంటికి రావాలని సాయికార్తీక్ ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే మూడో నెల్లో వస్తానని ఆమె చెప్పడంతో మనస్తాపానికి గురై ఈ నెల ఎనిమిదిన పురుగుల మందు సేవించారు. దీంతో చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ రాజేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:143
లేయర్ (లైవ్)	:120
బ్రాయిలర్ చికెన్	:254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:280
లేయర్ చికెన్	:204

నిమ్మ ధరలు



పెద్దవి	:రూ.60
సన్నవి	:రూ.30
పండ్లు	:రూ.20

ఉపాధిపై పచ్చ పెత్తనం

ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలంటూ ఒత్తిళ్లు
- బెదిరింపులకు భయపడి రాజీనామాలు చేస్తున్న వైనం
- మరికొందరిపై వేలాడుతున్న కత్తి
- తగ్గిపోయిన పనిదినాలు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ నేతల అరాచకాలకు అడ్డు లేకుండా పోయింది. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంపై పచ్చ పెత్తనం పెరిగింది. పనుల కల్పన విషయంలో వారి ప్రమేయం అధికమైందనే విమర్శలున్నాయి. విధులు మానేసి వెళ్లిపోవాలంటూ ఫీల్డ్ అసిస్టెంట్లపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి తమకు కావాల్సిన వారిని నియమించుకుంటున్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నెల్లూరు(పొగతోట): తెలుగు తమ్ముళ్ల జోక్యంతో జాతీయ ఉపాధి హామీ పథకం భ్రష్టు పడుతోంది. పనులు, సిబ్బంది విషయంలో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తెలుగుదేశం నేతల తీరు కారణంగా పనిదినాలు కూడా తగ్గిపోయాయి. ఒకప్పుడు వర్షాకాలం మినహా మిగిలిన రోజుల్లో నిత్యం 90 వేల నుంచి లక్ష మంది కూలీల వరకు పనులకు హాజరయ్యేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 50 వేల నుంచి 60 వేల్లోపే ఉంది. ఈ ఏడాది మేలో జిల్లా వ్యాప్తంగా 16,82,868 పనిదినాలను కల్పించారు. అదే జూన్‌లో 6,86,370 పనిదినాలను కల్పించారు. గతంతో పోలిస్తే ఈ సంఖ్య ప్రతి నెలా తగ్గుతోంది.

నాడు సవ్యంగా..

జిల్లాలో 626 పంచాయతీలున్నాయి. 3.32 లక్షల జాబ్‌కార్డులు కలిగిన కూలీలున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనుల పర్యవేక్షణకు, నిర్వహణకు ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎఫ్‌ఏ), టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు తదితర సిబ్బంది ఉన్నారు. కొన్ని పంచాయతీల్లో సీనియర్ మేట్లు ఎఫ్‌ఏలుగా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపుల్లేకుండా సవ్యంగా పనులు జరిగాయి. జాబ్‌కార్డులు కలిగిన వారు ఉదయం ఆరు గంటలకు పనులకెళ్లి 10.30కల్లా ముగించుకునే వారు. భోజనం తర్వాత వ్యవసాయ పనులకు వెళ్లేవారు. దీంతో రెండు కూలీల నగదు వారికి లభించేది. ఇబ్బంది లేకుండా కుటుంబ పోషణ జరిగిపోయేది.

జిల్లాలో..

పంచాయతీలు :	626
జాబ్‌కార్డులు :	3.32 లక్షలు
ఫీల్డ్ అసిస్టెంట్ల సంఖ్య :	556

నేడిలా..

2015 – 19 మధ్య కాలంలో టీడీపీ నేతలు యంత్రాలతో ఉపాధి పనులు చేయించి నిధులు స్వాహా చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక టీడీపీ నేతల కళ్లు ఈ పథకంపై మరోసారి పడ్డాయి. తమకు అనుకూలంగా ఉండే ఎఫ్‌ఏలను నియమించుకుంటే యంత్రాలతో పనులు చేయించి నిధులు కొల్లగొట్టొచ్చనే దురాలోచన చేశారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఇప్పటి వరకు సంగం, ఉదయగిరి, వింజమూరు తదితర మండలాల్లో నేతల ఒత్తిళ్లు భరించలేక 30 నుంచి 40 వరకు ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. నేతల తీరుపై ఎన్ని విమర్శలొచ్చినా పట్టించుకోవడంలేదు. ఇంకా కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బందిని విధులు వదిలేసి వెళ్లిపోవాలని భయపెడుతున్నారు.

ఇంకా ఎన్నో..

పనులు జరగకుండా ఎఫ్‌ఏలను టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. దీంతో పనిదినాల సంఖ్య భారీగా పడిపోయింది. వ్యవసాయ కూలీలు కూడా పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. పని చేసినందుకు కూలీలకు వేతనం నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. అనేక ప్రాంతాల్లో బోగస్ జాబ్‌కార్డులను సృష్టించేలా సిబ్బందిని టీడీపీ నేతలు బెదిరిస్తున్నారు. తమకు అనుకూలంగా ఉండే వారి ఆధార్‌కార్డులను సిబ్బందికి ఇచ్చి జాబ్‌కార్డులు చేయించాలంటూ ఒత్తిడి చేస్తున్నారని సమాచారం.



నా దృష్టికి రాలేదు



జిల్లాలో ఉపాధి పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉంది. కొత్త వారిని నియమించేలా చర్యలు చేపడుతున్నాం. ఎఫ్‌ఏలపై బెదిరింపులు, రాజీనామాలు చేయాలనే ఒత్తిళ్ల విషయం నా దృష్టికి రాలేదు. కష్టపడి పనులు కల్పించే సిబ్బందికి అండగా ఉంటాం. జాబ్‌కార్డులు కలిగిన కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.
– గంగాభవానీ, డ్వామా పీడీ

ఆక్వా అతలాకుతలం

వెనామీని వణికిస్తున్న 'లూజ్ షెల్'
- నెల రోజుల్లోనే చనిపోతున్న వైనం
- కనీస పెట్టుబడి సైతం రాక నష్టపోతున్న రైతులు

కావలి తీరంలో వెనామీ సాగు చేస్తున్న రైతులను 'లూజ్ షెల్ సిండ్రోమ్' వణికిస్తోంది. కండరాలను క్షీణింపజేసే ఈ వ్యాధి కారణంగా పంట కాలం పూర్తికాక ముందే గుంతల్లో పట్టుబడి చేయాల్సి వస్తుండటంతో దిగుబడి తగ్గి ఆక్వా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యాధికి కారణాలు అంతుబట్టకపోవడం, నివారణకు నిర్దిష్టమైన మందుల్లేకపోవడం వంటి సమస్యలు ఆక్వా రైతులకు శాపంగా మారాయి. జిల్లాలో వైట్‌స్పాట్ తర్వాత లూజ్‌షెల్ సిండ్రోమ్ సమస్యే ఎక్కువగా ఉంది.


లూజ్‌షెల్ సిండ్రోమ్‌కు గురైన రొయ్యలను పడుతున్న రైతులు

కావలి/ బిట్రగుంట: జిల్లాలో ఆక్వా సాగును వైరస్‌లు, వ్యాధులు వెంటాడుతున్నాయి. సాగుకు ముందు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, ఏ రైతుకు పంట ప్రారంభం నుంచి కంటి మీద కునుకు ఉండటం లేదు. రొయ్యల్లో వైట్‌స్పాట్ తర్వాత అత్యంత ప్రమాదకరమైన వ్యాధి 'లూజ్ షెల్ సిండ్రోమ్' ఎక్కువగా ప్రబలుతోంది. వెనామీలో రొయ్య పిల్ల 5 నుంచి 30 గ్రాముల బరువు పెరిగే లోపు ఏ దశలోనైనా లూజ్‌షెల్ వ్యాధి రావచ్చు. దీంతో రొయ్యల్లో కండరాలు క్షీణించి మెత్తగా మారడంతో పాటు ఇతర వ్యాధులు కలిసి ఉండటం, ఎక్కువ రోజులు కొనసాగడం వల్ల దీన్ని శాస్త్ర పరిభాషలో 'క్రానిక్ లూజ్‌షెల్ సిండ్రోమ్'గా పిలుస్తారు. చెరువులో రొయ్యలను వదిలిన 25 – 30 రోజుల నుంచి పట్టే వరకు ఏ దశలోనైనా ఈ వ్యాధి రావచ్చు. ఈ కారణంగా ఆకలి, ఎదుగుదల మందగించి రొయ్యలు చనిపోతాయి. ఆకలి మందగించడంతో మేత వినియోగంలో తేడా వచ్చి వేసిన మేతలో ఎక్కువ శాతం వృథా అవుతుంది. పంట కాలం పూర్తవ్వకముందే పట్టుబడి చేయాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని ఆక్వా రైతులు వాపోతున్నారు.

మూడు దశల్లో వ్యాధి

క్రానిక్ లూజ్‌షెల్ సిండ్రోమ్ వ్యాధి వైట్ గట్, వైట్ ఫీసిస్, లూజ్‌షెల్ అనే మూడు దశల్లో ఉంటుంది. వైట్ గట్ దశలో పేగు కణాలు చెడిపోవడంతో లోపలి పేగు తెల్లగా మారుతుంది. వెంటనే వైట్ ఫీసిస్ దశ ప్రారంభమవుతుంది. ఈ దశలో రొయ్య పేగుతో పాటు జీర్ణగ్రంధి కూడా చెడిపోయి తెల్లగా మారిపోతుంది. రొయ్య ఈదుతున్నప్పుడు వెనుక భాగంలో తెల్లటి దారాల్లా మలతంత్రువులు వేలాడుతుంటాయి. ఈ దశ నుంచి క్రమంగా లూజ్ షెల్ దశకు చేరుకుంటాయి. లూజ్‌షెల్ దశకు చేరుకున్న రొయ్యలు ఉదయం, సాయంత్రం వేళల్లో చెరువు అంచుకు చేరుకొని నెమ్మదిగా కదులుతుంటాయి. శరీరం సహజ రంగు కోల్పోయి తేడాగా కనిపిస్తాయి. రొయ్య పిల్ల పైభాగంలో పరీక్షగా గమనిస్తే మట్టి, బ్లూ, గ్రీన్ ఆల్గే తంతువులు, బాహ్య పరాన్న జీవులు అంటి పెట్టుకొని కనిపిస్తాయి. మొప్పలు మట్టి రంగులో ఉంటాయి. కండరాలు క్షీణించిపోవడంతో రొయ్య మెత్తబడిపోయి తపకల్లా కనిపిస్తాయి.


క్రానిక్ లూజ్‌షెల్ సిండ్రోమ్‌కు గురైన రొయ్య పిల్లలు

యాజమాన్య పద్ధతులతోనే నివారణ

రొయ్యల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా క్రానిక్ లూజ్‌షెల్ సిండ్రోమ్‌ను నివారించుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు. పంట పూర్తయిన తర్వాత కనీస విరామం పాటించడం, చెరువును బాగా ఎండబెట్టి పాతమట్టిని తొలగించడం, స్టాకింగ్ తగ్గించడం, నాణ్యమైన సీడ్‌ను ఎంపిక చేసుకోవడం, విషపూరితమైన బ్లూగ్రీన్ ఆల్గే పెరుగుదలను ప్రేరేపించే మినరల్ ఎరువుల వాడకాన్ని తగ్గించడం వంటి చర్యలతో వ్యాధిని అరికట్టవచ్చు. వీటితో పాటు జీర్ణగ్రంధి పనితీరును మెరుగుపర్చేందుకు మేతతో పాటు నాణ్యమైన ఫీడ్ ప్రో బయాటిక్స్, ప్రీ బయాటిక్స్, ఫైటో బయాటిక్ మందుల వాడకం ద్వారా రొయ్యల్లో వ్యాధి తీవ్రతను కొంత మేర తగ్గించొచ్చని చెప్తున్నారు. అయితే వ్యాధి నివారణకు మాత్రం మార్కెట్లో ఎలాంటి నిర్దిష్టమైన మందులు అందుబాటులో లేవు. వ్యాధి తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రొయ్యల్లో ఆకలి, పెరుగుదల రేటు మందగించిన వెంటనే పట్టుబడి చేసుకోవడం మంచిదని నిపుణులు పేర్కొంటున్నారు.

వ్యాధి కారకాలు

వ్యాధి కారణాలను నిర్దిష్టంగా కనిపెట్టలేకపోయినా కొన్ని కారకాలను మాత్రం గుర్తించారు. ఈ వ్యాధి బ్లూగ్రీన్ ఆల్గే ఎక్కువగా ఉన్న చెరువుల్లో వ్యాపిస్తున్నట్లు ఆక్వా నిపుణులు చెప్తున్నారు. విష పూరితమైన బ్లూగ్రీన్ ఆల్గేలను రొయ్యలు ఆహారంగా తీసుకున్నప్పుడు పేగుల్లో విష పదార్థాలు విడుదలై కణాలు చెడిపోతున్నాయి. ఈ క్రమంలో విబ్రియో బాక్టీరియా కూడా ఎక్కువైతే రొయ్యలు తెలుపు రంగులోకి మారి వ్యాధి తీవ్రత ఎక్కువవుతోంది.

గంజాయి మత్తులో వీరంగం


విచారణ జరుపుతున్న పోలీసులు

ఆత్మకూరు: పట్టణ పరిధిలోని టిడ్కో నివాసాల వద్ద ఓ యువకుడు గంజాయి మత్తులో శనివారం అర్ధరాత్రి వీరంగం సృష్టించారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. టిడ్కో గృహాల్లో నివసిస్తున్న గోవింద్ గంజాయికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో గంజాయి సేవించి స్థానికంగా ఉన్న పానీపూరి వ్యాపారిపై దాడి చేశారు. అనంతరం తన ఇంటి వద్దకెళ్లి పలువుర్ని దుర్భాషలాడుతూ అడ్డొచ్చిన వారిపై దాడికి పాల్పడ్డారు. తండ్రితో సైతం గొడవపడి, తన వేలును కోసుకున్నారు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఎస్సై జిలానీబాషా ఘటన స్థలానికి చేరుకొని అక్కడ పలువురు యువకులను విచారించి గోవింద్‌ను అదుపులోకి తీసుకున్నారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నామని ఎస్సై తెలిపారు.

మేకలను తప్పించబోయి..

- బైక్ అదుపుతప్పి బ్యాంక్ ఉద్యోగి మృతి


ఖాజారహంతుల్లా (ఫైల్)

ఉదయగిరి: మేకల మందను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగి మృతి చెందిన ఘటన వింజమూరు మండలంలోని చాకలికొండ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల వివరాల మేరకు.. ఉదయగిరిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఖాజారహంతుల్లా (56) ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాకలికొండ ఏపీజీబీలో డిప్యుటేషన్‌పై ఒక రోజు విధులు నిర్వర్తించేందుకు వెళ్లారు. బ్యాంక్ విధులు ముగించుకొని ఉదయగిరికి బైక్‌పై బయల్దేరారు. చాకలికొండ సమీపంలో మేకల మంద రోడ్డుకు అడ్డుగా రావడంతో, ఒక్కసారి బ్రేక్ కొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. అటుగా వస్తున్న వారు గమనించి బ్యాంక్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వింజమూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు.

ఏకగ్రీవంగా వీఆర్‌ఏల కార్యవర్గ ఎన్నిక



కార్యవర్గ కమిటీ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో గల ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ సహాయకుల ఎన్నికను ఆదివారం నిర్వహించారు. రెగ్యులర్ వీఆర్‌ఏలతో పాటు రిక్రూట్‌మెంట్ వీఆర్‌ఏలు ఎన్నికల్లో ఓటేశారు. ఎన్నికలను ఏపీఆర్ఎస్ఏ జిల్లా ట్రెజరర్ సతీష్‌కుమార్, సభ్యుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీలో..

గ్రామ రెవెన్యూ సహాయకుల జిల్లా నూతన అధ్యక్షుడిగా ప్రేమదాస్ (కావలి), ప్రధాన కార్యదర్శిగా నరసింహమూర్తి (బుచ్చిరెడ్డిపాళెం), జిల్లా ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ, జిల్లా ట్రెజరర్‌గా ఆనంద్‌సుదర్శన్, సహాధ్యక్షుడిగా బుజ్జయ్య, కార్యవర్గ సభ్యులుగా నాగార్జున, శ్రీనివాసులు, సుమలత, ప్రవీణను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్యను సభ్యులు ఘనంగా సన్మానించారు.

యువతిపై లైంగిక దాడికి యత్నం

మనుబోలు: మండలంలోని అక్కంపేటలో తనపై మందా పోలయ్య అనే వ్యక్తి లైంగిక దాడికి యత్నించారంటూ పోలీసులకు ఓ యువతి ఆదివారం పిర్యాదు చేశారు. ఈ మేర కు ఎస్సై రాకేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవస్థానానికి ఆస్తి సమర్పణ



సంగం: మండలానికి చెందిన అక్కరాజు శ్రీదేవమ్మ ఆస్తిని సంగం సంగమేశ్వరస్వామి దేవస్థానానికి దాతృత్వంగా అందజేశారు. సుమారు రూ.10 లక్షల విలువైన ఎనిమిది అంకణాల ఇంటి పత్రాన్ని దేవస్థాన అధికారులకు ఆమె కుమారుడు పద్మనాభరావు సమర్పించారు. ఆలయాభివృద్ధికి వినియోగించాలని కోరారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

మనుబోలు: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎస్సై రాకేష్ పేర్కొన్నారు. మనుబోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలకు బహుమతులను ఆదివారం అందజేశారు. డబుల్స్ విజేతలైన మనుబోలుకు చెందిన గాంధీ, భరత్‌కు ట్రోఫీ, రూ.ఆరు వేలు, రన్నర్స్‌గా నిలిచిన శ్రీనివాసులు, శ్రీనుకు రూ.నాలుగు వేలను అందజేశారు. సింగిల్స్ విజేత భరత్‌కు రూ.నాలుగు వేలు, రన్నర్స్ చంద్రకుమార్‌కు రూ.రెండు వేలను పంపిణీ చేశారు.